కథ

# పంజరం

జె. సుధ

బయట కారు చప్పుడు వినబడింది. చదువుతున్న పేపర్ పక్కన పడేసి మంచం దిగి బాల్కనీలోకి వెళ్లి తొంగి చూశాను. ''వీళ్లు వచ్చేశారు. భోజనాలు రెడీ చేయాలి'' అనుకుంటూ మెయిన్ డోర్ లాబ్ ఓపెన్ చేసి టేబుల్ మీద కంచాలు పెట్టి ఫ్రిజ్ బాటిల్స్ తీస్తూ ఉంటే డోర్ ఓపెన్ అయింది.

''అమ్మా! అన్నం పెట్టు'' అంటూ రమ్య మెడలో చున్నీ, కారు తాళాలు సోఫాలో విసిరి కొట్టి 'హైహీల్స్' దిగి, చేతులు కడుక్కుందుకు వాష్‌బేసిన్ దగ్గరకి పరుగెత్తింది.

''బాసాని బేంక్ దగ్గర దింపేశాను. పని ఉందిట. మూడు గంటలకి వస్తాను అన్నారు. మనల్ని భోజనం చేసెయ్యమన్నారు. త్వరగా పెట్టు. ఇంటర్‌నెట్ సెంటర్‌కి వెళ్లాలి. 'మెయిల్స్' ఇచ్చి రావాలి'' అంటూ తొందర పెట్టింది.


అన్నీ సవ్యంగా జరిగితే, ఇంక కొద్ది రోజులలో పై చదువులకు ఇది విదేశాలకి ఎగిరిపోతుంది. ఆ పనుల మీదే ఈయన ఏకంగా సెలవు పెట్టి మరీ దీన్ని వెంటేసుకుని తిరుగుతున్నారు. పి.జి. చెయ్యడానికి అమెరికన్ యూనివర్సిటీ నుండి సీటు సంపాదించింది. పైగా అక్కడి నుండి దీని సీనియర్స్ రోజూ ఫోన్లు. ''మేం అందరం ఉన్నాం. మీరు భయపడకండి. బ్రిలియంట్ స్టూడెంట్. కెరీర్ పాడుచెయ్యకండి'' అంటూ.

నేను నా ఆలోచనలో ఉండగానే కోడిలా నాలుగు మెతుకులు కెలికి చెయ్యి కడిగేసుకుంది. హైహీల్స్ ఎక్కి, మెడకి చున్నీ తగిలించుకుంది. హేండ్‌బ్యాగ్ తీసుకుని ''అమ్మా! బై!! గంటలో వస్తాను'' అంటూ తలుపు చప్పుడు అయ్యేలా గట్టిగా లాగింది. రెండు నిమిషాల తరువాత కింద కెనెటిక్ హోండా స్టార్ట్ అయిన చప్పుడు వినబడింది.

ఇరవై సంవత్సరాల వయస్సుకి రమ్యలో ఎంత ధీమా! ప్రపంచాన్ని జయించాలి అన్న పట్టుదల. అడుగు అడుగులో ఆత్మవిశ్వాసం. తన చదువు గురించి తీసుకున్న 'బేంక్ లోన్' తనే తీరుస్తాను అని అంటూంది.

''డబ్బుది ఏం ఉంది అమ్మా! దాన్ని రైట్ టైమ్‌లో వాడుకుంటేనే దాని విలువ. ఆ తరువాత అది చిత్తుకాగితాలతో సమానం'' అంటూ కొత్త కొత్త పాయింట్లే చెబుతూ ఉంటుంది.

ఇది ఇలా మాట్లాడినప్పుడల్లా నాకు మా



అమ్మ గుర్తుకి వస్తుంది. తను పెద్దగా చదువుకోకపోయినా, తను చెప్పే అనుభవాల పాఠాలు నేను చదివే బుక్స్‌లో కూడా దొరికేవి కాదు. ఇది ఎంత అయినా ఆ తల్లికి మనవరాలు కదా! ముందరికాళ్లకి బంధం బాగానే వేస్తుంది.

కానీ రమ్య విషయంలో నేను కేవలం ఒక ఆడపిల్ల తల్లిగా మాత్రమే ఆలోచించగలుగుతున్నాను. ఎందుకు? ఆడపిల్ల జీవితం ఎప్పుడూ ఒక 'రక్షణ వలయం'లో మాత్రమే ఉండాలి అని నాకు ఎందుకు అనిపిస్తోంది.

పెద్దలు తీసుకున్న నిర్ణయాలను ఆచరించడం తప్ప నేను కూడా ఆలోచించవచ్చు అని నాకు చాలాకాలం దాకా తెలియదు. ఆడపిల్ల అంటే 'పరాయి సొత్తు' అని చిన్నప్పటినుండి చుట్టుపక్కల వాతావరణం పెంచిన ఇన్‌సెక్యూరిటీలోంచి పుట్టిన ఆత్మన్యూనత. ప్రతీదానికి భయం.

చిన్నచిన్న నిర్ణయాలకి కూడా ఆయనవైపో,

రమ్యవైపో చూడటం. నా తరపున వాళ్లు ఏదో ఒక నిర్ణయం తీసుకుంటే ఆనందంగా ఆచరించటం ఇదే అలవాటు. ఈరోజు రమ్యని ఇలా ఒంటరిగా విదేశాలకి పంపాలి అంటే నిజానికి నేను పంపించటం లేదు. అదే వెళుతోంది. ఏదో తెలియని భయం.

ఇదే వయస్సుకి నేను ఎలా ఉన్నాను? పెళ్లే ధ్యేయంగా చదువుతున్న డిగ్రీ. నా పెళ్లిచూపులు, పెళ్లిమాటలు. ఆ రోజులలో నేను అమ్మని అమాయకంగా అడిగిన ప్రశ్నలు. దానికి ఆవిడ రియాక్షన్ నాకు ఇప్పటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

నా పుట్టింటి జీవితం నాకు అపురూపంగా అనిపించినా ఇప్పటికీ వదలని ఆ మధ్యతరగతి బేలతనం, ఆ అమాయకత్వం, భయం నన్ను ఇబ్బంది పెడుతూనే ఉంటాయి.

★ ★ ★

''రేపు వాళ్లు నిన్ను చూసుకోవడానికి వస్తున్నారు. తలకి నూనె మర్దన చేస్తాను. కుంకుడుకాయలు కొట్టి డబ్బాలో పోశాను. వెళ్లి నానపెట్టుకో. రేపు ఉదయం 5 గంటలకి నీ తలస్నానం పూర్తి అవ్వాలి'' అంటూ వేడి చేసిన ఆముదం గిన్నె తీసుకుని ముందు గదిలోకి వచ్చింది అమ్మ.

చదువుతున్న నోట్స్ చాప మీద పెట్టి జడ విప్పుతూ అమ్మ వైపునకు జరిగాను. ఏ పండుగ లేనప్పుడు వచ్చేది 'పెళ్లిచూపుల పండుగ'. ఈసారి ఇది నాకోసం వచ్చింది. లక్ష్మి అక్క పెళ్లిచూపులకి, పక్క ఇంటి అక్క పెళ్లిచూపులకి. ఆ పూట స్కూల్ మానెయ్యడానికి అమ్మని కాకా పట్టి ఒట్టు పెట్టి తాంబూలాలు అందించటానికి, టిఫిన్‌లు, కాఫీలు అందించడానికి నేను సుమతితో పోటీపడేదాన్ని. పెళ్లిచూపుల్లో ఆడపిల్ల ఎంత ఒద్దికగా ఉండాలో తెలిసినా మొదటిసారి కదా! నాకు భయంగానే ఉంది.

''రేపు మధ్యాహ్నం కాలేజీకి వెళ్లకు. వాళ్లు మూడుగంటలకి వస్తాం అన్నారు. మొన్న పుట్టినరోజున కొన్న చీర కట్టుకో. జాకెట్టు లూజుగా ఉంది అన్నావు కదా! పిన్నిగారికి ఇస్తే కుట్టువేసి ఇస్తామన్నారు. వెళ్లి ఇచ్చిరా'' అంటూ ఆముదం జిడ్డు తలగడకి అంటకుండా పాత పంచె తలకి వాసిని చుట్టింది.

ప్రతీ గురువారం రాత్రి ఇలాగే నాకు, సుమతికి నూనె మర్దన చేస్తుంది అమ్మ. ఆ జిడ్డు వదిలించడానికి ఉదయం ఐదుగంటలకి మొదలుపెట్టిన స్నానం- మూడు బకెట్ల నీళ్లు, తవ్వెడు కుంకుడు కాయలతో ఆరు గంటలకి ముగుస్తుంది.

తలకి పాతచీర పిడప చుట్టి, లంగా ఓణీ ఒంటికి చుట్టుకుని స్నానాల గది తలుపు ఓరగా తీసి బయట ఎవ్వరూ లేకుండా చూసి నాలుగు అంగల్లో వంట గదిలోకి పరుగెత్తాను. ఒకవైపు నుండి చేతులు పీకుతున్నాయి. నీరసం వచ్చేస్తోంది.

అప్పటికే కుంపటి మీద ఉడుకుతున్న పప్పు కిందికి దించి కొన్ని నిప్పులు ఇత్తడి పళ్లెం మీద వేసి ''త్వరగా రా! సాంబ్రాణి వేస్తాను. అవతల నాకు చాలా పనులు ఉన్నాయి'' అంటూ అమ్మ తొందర పెట్టింది. అక్కడే కలిపి పెట్టిన పాలగ్లాసు తీసుకుని అమ్మ ముందు చతికల పడ్డాను.

జుట్టు తడి తుడిచి నిప్పుల్లో వేసిన సాంబ్రాణి పొగ జుత్తులోకి వెళ్లేలాగా, తలని బాగా వెనక్కి వంచి, జుత్తు ఎత్తి పట్టుకుంది. అసలే నీరసం. దానికితోడు సాంబ్రాణి పొగ మత్తుగా కమ్మి, సొమ్మసిల్లినట్లు అయింది.

''త్వరగా తల ఆరబెట్టుకుని రా! నువ్వు కాలేజీకి వెళ్లేలోగా సగం పని పూర్తి అవ్వాలి'' అంటూ అమ్మ వంటలో జొరబడింది. దువ్వెన తీసుకుని అద్దం ముందు నిలబడ్డాను. పఠంలో లక్ష్మీదేవి బొమ్మలా, నా వెనుక వత్తుగా, పొడవుగా పరుచుకుంది జుత్తు. జుత్తు అంతా ముందుకు వేసుకుని, పాయలు విడదీసుకుంటూ నన్ను నేను గర్వంగా చూసుకున్నాను. నాగుపాము లాంటి నీ జడ చూస్తే అందరూ నీ వెంటే పడతారులే!'' అంటుంది పూర్ణ. దానికి అందరి కంటే చిన్నజుత్తు మరి. అందుకే ఆ ఉడుకుబోత్తనం.

నిజమో కాదో ఈరోజు తేలిపోవాలి. నా ఆలోచనకి నాకే నవ్వు వచ్చింది. మధ్యాహ్నం జరిగే పెళ్లిచూపుల కన్నా ఈ విషయం కాలే

## హాస్యానందం

నవ్వు ఎంతటి టెన్షన్‌నైనా పారద్రోలుతుంది. ఇప్పుడు మల్లికా షెరావత్ కూడా నవ్వుకి ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. తనకు తెలిసిన జోక్స్‌ని ఫ్రెండ్స్‌కి ఎస్ఎంఎస్ చేస్తూ ఎంజాయ్ చేస్తోంది. జాకీ చాన్‌తో ఆమె కలిసి నటించిన ది మిత్ గురించి మంచి టాక్ రావడంతో ఆమె జోక్స్‌తో కాలక్షేపం చేస్తోంది. అన్నట్టు ఈమె డ్రెస్ కోడ్ కూడా మారిపోయింది. వెస్టన్ స్టయిల్‌లో సెక్సీగా కన్పిస్తున్న ఈభామని చూసి అంతా నవ్వుకుంటున్నారు. విదేశాలనుంచి వచ్చిన కొత్త కొత్త డ్రెస్‌లతో వార్డ్‌రోబ్ నిండిపోయిందట. ఎంత మార్పు?



జీలో ఎవరికీ తెలియకుండా ఎలా రహస్యంగా ఉంచాలా? అన్న విషయం మీదే నాకు ఎక్కువ టెన్షన్‌గా ఉంది.

అలవాటు లేని చీరకట్టుతో రెడీ అయి, పక్కన పిన్నిగారి ఇంట్లో కూర్చున్నాను. ముందు గదిలో మాటలు, హడావిడి వినబడుతూనే ఉంది. కాసేపటికి అమ్మ వచ్చింది ''రా!'' అంటూ.

''అబ్బాయి ఎలా ఉన్నాడు? నువ్వు చూశావా? అందంగా ఉన్నాడా? మీసాలు ఉన్నాయా?'' అంటూ అమ్మమీద ప్రశ్నల వర్షం కురిపించాను.

''నోరు మూసుకుని పద! అవతల వాళ్లు ఎదురుచూస్తున్నారు'' అంటూ, నన్ను రెక్కపుచ్చుకుని లాక్కెని వెళ్లింది. ఒక అరడజను మంది ఉంటారు. వాళ్లలో పెళ్లికొడుకు ఎవరో ఒక్కసారి తల ఎత్తగానే ఎలా తెలుసుకోవాలో అర్థం కాలేదు.

అందరితో పాటు నాకూ కాఫీగ్లాసు అందిస్తూ ''అటువైపునుండి రెండవ కుర్చీలో కూర్చున్న అబ్బాయి పెళ్లికొడుకు'' అంటూ నా చెవిలో రహస్యం చెప్పింది అమ్మ.

నన్ను పెద్దగా ఇబ్బంది పెట్టకుండానే, ఏ సంగతీ త్వరలో తెలియజేస్తాం అంటూ వచ్చినవాళ్లు వెళ్లిపోయారు. రిజల్ట్స్ కోసం ఎదురుచూసే విద్యార్థుల్లాగా మేం మిగిలాం.

ఇంక ఆరోజు నుండి మా ఇంటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒలింపిక్స్‌లో 'షాట్‌పుట్' విసిరే వస్తాదుల్లా నా తల్లిదండ్రులు ఎలాగైనా శక్తిని అంతా కూడదీసుకుని నన్ను ఈ మధ్యతరగతి వలయం నుండి వీలైనంత దూరంగా విసిరివేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

పెళ్లిచూపుల తతంగాన్ని ఆషామాషీగా తీసుకున్నానుగానీ, రెక్కలు ముక్కలు చేసుకుని పొదుపు చేసిన డబ్బుని, వీళ్లు కట్నం రూపంలో ఇవ్వడానికి రెడీ అవుతూ ఉంటే మాత్రం చాలా బాధ వేసింది. నా ఒక్కదానికే ఇంత ఖర్చు చేసేస్తే, వెనుక ఇంకా ఇద్దరు ఉన్నారన్న సంగతి వాళ్లకి ఆ సమయంలో గుర్తుకిరాలేదు కానీ, నాకు గుర్తుకి వచ్చింది.

ఆడపిల్ల పుట్టింది అంటే ఇరవై సంవత్సరాలు తరువాత దాని పెళ్లే ఏకైక లక్ష్యంగా కన్న తల్లిదండ్రులు బ్రతుకుతారు. ఉదయం ఎనిమిది గంటలకు వెళ్లిన నాన్న రాత్రి తొమ్మిది గంటలకు వస్తారు. ఐదు గంటలకు నిద్రలేచిన అమ్మ రాత్రి పది గంటల వరకు ఒక్క నిమిషం వృధాచెయ్యదు.

తిండికి, బట్టకి లోటులేకుండా చూసుకుంటూ, బుట్టలు అల్లి షాపులకి వేసి చీరల బిజినెస్ చేసి ఆఖరికి బొగ్గుల బస్తాతో అడుగున మిగిలిన గుండ కూడా బయట పారెయ్యకుండా, దాంట్లో పేడ కలిపి ఉండలు చేసి ఎండ బెట్టి బాయిలర్‌లో నీళ్లు కాచుకోవడానికి వాడుతుంది అమ్మ. ఈ కష్టం అంతా ఎందుకు? కేవలం ఆడపిల్లని గడప దాటించడం కోసమే కదా!

పెళ్లిచూపులు అయి పదిహేను రోజులు అయింది. వాళ్ల నుండి ఏ కబురూ రాలేదు. కానీ రోజుకి ఒక పెళ్లి చొప్పున, పదిహేను పెళ్లిళ్లు చేసినంత హడావిడి వాతావరణం ఇంట్లో ఉంది. పుస్తకాల ముందు కూర్చున్నా నాకు ఇవే ఆలోచనలు.

పరధ్యానంగా పుస్తకం తిరగేస్తున్న నాకు లోపలి నుండి జారిపడిన నాలుగు మడతల కాగితం చూసి అదిరిపడ్డాను. మడతలు విప్పకుండానే అది ఏంటో నాకు తెలిసిపోయింది. ఇప్పటిదాకా బుర్రలో తిరుగుతున్న ఆలోచనలకి బ్రేక్ పడింది. కొత్త ఆలోచనలతో భయం కూడా పట్టుకుంది.

నాలుగు రోజులు రాత్రి, పగలు ఈ విషయమే ఆలోచించాను. అమ్మకి ఈ వియం ఎలా చెప్పాలి? ఎలా చెప్పాలి? ఎలా చెప్పాలి!!! ధైర్యం చాలటం లేదు మరి.

ఆరోజు మధ్యాహ్నం నేను కాలేజీ నుండి ఇంటికి వచ్చేసరికి అమ్మ వంటగది గుమ్మంలో కూర్చుని బేగ్‌లకి హేండిల్స్ అల్లుతోంది, చెప్పులు వారగా వదిలి. లంగా కుచ్చిళ్లు తడవకుండా పైకి పట్టుకుని కాళ్లు కడుక్కుని వచ్చి అమ్మ దగ్గర కూర్చున్నాను.


''ఏమే! అప్పుడే వచ్చేశావు? క్లాసులు లేవా? ఆ వైరు ఇలా అందుకో. ఈ రెండు బేగ్‌లకి హేండిల్స్ వేస్తే, రేపు నాన్నగారు ఆఫీసుకి వెళుతూ షాపులో ఇచ్చేస్తారు'' అంది. అమ్మ అడిగిన వైరు అందించాను.

జడ ముందుకు వేసుకుని చివరి జుత్తుని కుడి చేతి చూపుడువేలుతో ఉంగరాలు తిప్పుకుంటూ కూర్చున్నాను. ''ఏవిటి సంగతి? కొత్తగా వచ్చిన సినిమాకి నువ్వు, నీ ఫ్రెండ్ వెళ్లాలని అనుకుంటున్నారా? నాన్నగార్కి చెప్పి ఒప్పించాలి. అంతేనా?'' అంటోంది అమ్మ నా వైపుకి చూడకుండానే. నేను ఏం మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాను.

నా మౌనం ఆవిడకి ఇంకోలా అర్థం అయింది.

## సంచలనానికి నాంది

**సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఏ సంచలనం వస్తుందో ఎవరికీ తెలియదు. కుటుంబ సంబంధాల నేపథ్యంలో భార్యల మనస్తత్వాన్ని ప్రతిబింబించే కొత్త చిత్రం రూపకల్పనలో బిజీగా ఉన్నాడు అబ్బాస్ మస్తాన్. 'అజ్‌నబీ' అని పేరు పెట్టిన ఈ చిత్రంలో బాబీడియోల్, అక్షయ్‌కుమార్, కరీనాకపూర్, బిపాషాబసులు నటిస్తున్నారు. భార్యమీద అనుమానం హత్యకి ఎలా దారితీసిందో తెలియజేసే సబ్జెక్ట్‌తో మస్తాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం బాలీవుడ్‌లో ఎలాంటి సంచలనానికి నాంది పలుకుతుందో చూడాలి మరి!**



పెళ్లిచూపులు అయిన దగ్గర నుండి కాస్త చురుకు తగ్గింది కదా. అప్పుడే పుట్టింటి మీద బెంగ మొదలు అయిందేమోనని ఆవిడ అనుమానం. అల్లుతున్న బేగ్ పక్కన పెట్టి చెంగుతో మొహం తుడుచుకుంటూ ''అయితే ఏమిటి? వివరంగా చెప్పు?'' అంటూ నావైపు తిరిగింది.

''ఉండు'' అంటూ ఒక్క అంగలో వెళ్లి పుస్తకాల అడుగున పెట్టిన కాగితం మడత తెచ్చి అమ్మకి ఇచ్చాను.

''ఏమిటి? నువ్వే చదువు. నాకు కళ్లజోడు లేదు'' అంది అమ్మ. బల్లమీద కళ్లజోడు తెచ్చి ఇచ్చాను. అమ్మ చదువుతూ ఉంటే నాకు గుండెల్లో భయం వళ్లంతా పాకింది. వణుకు పుట్టింది. అది పక్కింటి పిన్ని గారి అక్క కొడుకు భాస్కరం రాసిన 'ప్రేమలేఖ'. ''నువ్వు వప్పుకుంటే కట్నం లేకుండా నిన్ను పెళ్లిచేసుకుంటాను'' అని ఆ రెండు పేజీల సారాంశం.

''మీరు వెళ్లి వాళ్లనే అడగ వచ్చు కదా! కట్నం లేకుండా, కేవలం పెళ్లిఖర్చులతో అయిపో తుంది'' మాట మాట పేర్చుకుంటూ లోపలి వణుకు బయట పడనీయకుండా తల వంచుకుని చిన్నగా గొణిగినట్లు అన్నాను.

అమ్మ కళ్లజోడు తీసి పక్కన పెట్టి ముక్కుపుడక మెరిసేలా నవ్వింది. ''నువ్వు ఇలా అడ్డుగోలుగా ఆలోచించి చదువు పాడుచేసుకుంటావా? పెళ్లి పేరు వినగానే పిల్ల పరీక్షలు తప్పింది అని మాట పడతావా ఏంటి? ఇటు చూడు. వయసు వచ్చిన ఆడపిల్లకి పెళ్లి చేసి 'రక్షణ' కల్పించవలసిన బాధ్యత తల్లితండ్రులది. ఆ ఆలోచన నీకు అనవసరం. ప్రపంచంలో కట్నం నీకు ఒక్కదానికే ఇవ్వటం లేదు. అది లోకాచారం. అందరితో పాటు మనం కూడా పాటించాలి.''

''అయినా ఈ ప్రభాకరం విషయమే తీసుకో. 'లా' చాలా సంవత్సరాలుగా చదువుతున్నాడు. వీళ్ల అమ్మ ధాటికి ఆగలేక ఆ తండ్రి పారిపోయాడు అని అంటారు. వెనుక ఇద్దరు ఆడపిల్లలు తల్లిని పోలిన వాళ్లే. బాధ్యతలు ఎక్కువ. ఆ అబ్బాయి కట్నం వద్దు అని అన్నా, వాళ్ల అమ్మ లాంఛనాల పేర జీవితాంతం మన నుండి ఆశించవచ్చు.

ఈ భాస్కరం అయినా ఇంకో శంకరం అయినా, పెళ్లి అయిన ఏడాదో, రెండు ఏళ్లో మోజు, మురిపెం, ఆ తరువాత సంసార బాధ్యతలు. ఖర్చులు పెరిగాయి అంటే ఈ 'ప్రేమలు' వాటి ముందు నిలబడవు.

ఇప్పుడు నీకు వచ్చిన సంబంధమే చూడు. అబ్బాయిది మంచి జీతం ఉన్న ఉద్యోగం. ముందు ముందు ప్రమోషన్‌లు రావచ్చు. ట్రాన్స్‌ఫర్స్ మీద దేశం అంతా తిరగవచ్చు. అబ్బాయి తల్లీ తండ్రీ పొలం చూసుకుంటూ సొంత ఊరిలో ఉంటారు గానీ, ఇలా ఊరూరూ మీతో తిరగకపోవచ్చు. ఒక్కసారి వాళ్లు అడిగినంత కట్నం ఎలాగో అలాగ ఇచ్చేస్తే ఇంక మేం నీ గురించి ఆలోచించుకోనవసరం లేదు'' అంటూ పక్కన పడేసిన బేగ్ తీసుకుని అల్లుకోవడం మొదలుపెట్టింది.

ఎంతో దూరదృష్టితో అమ్మ చెప్పిన ఇన్ని 'జీవిత సత్యాలు' విన్న తరువాత, నాకు ఇంక మాట్లాడడానికి ఏం మిగలలేదు. నా జీవితం మొత్తం ఎలా ఉండాలో నిర్ణయించబడింది. అసలు రెక్కలే లేని నాకు వాళ్ల శక్తిమేరకు ఒక పంజరాన్ని రక్షణగా అమర్చారు. నేడు అది బంగారు పంజరం అయింది. ఇదే నా లోకం. ఇదే నా జీవితం.

కానీ రమ్య అలా కాదే! స్వేచ్ఛే ఊపిరిగా, ఆత్మవిశ్వాసం ఆలంబనగా, ఆకాశమే హద్దుగా, రెక్కలు చాచి ఎగురుతాను అంటోంది, నా బంగారు తల్లి. నా అర్థం పర్థం లేని భయాలతో దాని రెక్కలు విరిచెయ్యకూడదు. తల్లిగా ఆ లేత రెక్కలకి కావల్సిన శక్తిని అందించాలి. కాలంతో పాటూ నేనూ మారాలి.

'పంజరం'లోంచి అయినా బయటి ప్రపంచం కనబడినంతా కళ్లు తెరిచి చూడాలి.

☆

## చర్చనీయాంశం

***తన కొత్తచిత్రాల గురించి, తన వ్యక్తిగత విషయాల గురించి అందరికీ తెలియజేయడానికి ఓ పోర్టల్ అవసరం అని భావించిందో ఏమో గానీ అందాలభామ ఐశ్వర్యారాయ్ తన పేరుమీద ఓ వెబ్‌సైట్‌ని ప్రారంభించింది. అజయ్‌దేవ్‌గన్ సినీఫ్లోర్ డాట్‌కామ్ అనీ, షారూక్‌ఖాన్ ఎస్‌ఆర్‌కె డాట్‌కామ్ అనీ వెబ్‌సైట్లు ప్రారంభించాక ఇప్పుడు ఐశ్వర్యారాయ్ తన పేరుమీద ప్రారంభించబోయే వెబ్‌సైట్‌కి ఓ రూపం కల్పించనుంది. పేరు ఇంకా ఖరారుకాని ఈ వెబ్‌సైట్‌కి ఎలాంటి ఈమెయిల్స్ వస్తాయో, ఇంకా ఏమేం చదవాల్సి వస్తుందో చూడాలి మరి!***

